క్లుప్తంగా

వెంకన్న సన్నిధిలో ఆధ్యాత్మిక శోభ


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబు, ప్రసాదబాబుల ఆధ్వర్యంలో స్థాలీపాక హోమం, వివాహప్రవేశ ప్రధాన హోమాలు నిర్వహించారు. బుధవారం రాత్రి ఫాల్గుణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ మండపంలో అలివేలుమంగ వేంకటేశ్వరస్వామివారి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని, శ్రీవారి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణం తర్వాత తలంబ్రాలు శిరస్సున ధరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి.రాజసులోచన, సిబ్బంది రాజేష్, భక్తులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం కుట్రలు

అనకాపల్లి: విశాఖఉక్కును కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రం ఇవ్వాల్సిన సొంత గనులు ఇవ్వకుండా కావాలనే ఇక్కట్లకు గురి చేసిందని పేర్కొన్నారు. నిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా బీజేపీ కుట్రలు పన్నుతోందన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని స్టీల్‌ప్లాంట్ మనుగడకు తోడ్పాటునందించాలన్నారు.

అమ్మవార్లను దర్శించుకున్న మలసాల


జగన్నాథపురం నూకాంబిక అమ్మవారి సన్నిధిలో మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ గురువారం మండలంలోని మొండిపాలెం దుర్గమాంబ, జగన్నాథపురంలో నూకంబిక అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించాలని ప్రార్థించారు. ఆయన వెంట ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ శ్రేణులు, ఆయా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 4,526 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,750	4,250
మొదటి రకం	3,520	4,240
రెండో రకం	3,450	3,820
మూడో రకం	3,300	3,560

అనకాపల్లి సినిమాలు

ఈగల్ : రాజా
గామి : సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు : సత్యనారాయణస్క్రీన్-2
షరతులు వర్తిస్తాయి (మార్నింగ్, సాయంత్రం, రాత్రి ఆటలు)
అనన్య (మధ్యాహ్నం ఆట): షిర్డిసాయి
ఓం భీం బుష్ : పర్తిసాయి
నువ్వు నేను : వెంకటేశ్వర
రికార్డ్ బ్రేక్ : శ్రీసత్య
భీమా : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-36 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 348 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 256 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

అభివృద్ధి C/o బయ్యవరం


హైస్కూలు వద్ద నిర్మించిన సిమెంట్ రోడ్డు

- రూ.కోటికి పైగా వెచ్చించి పలు అభివృద్ధి పనులు
- ఇంటింటి కుళాయిలతో తాగునీటి ఇక్కట్లకు చెక్
- కొత్తగా సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణం

కశింకోట: మండలంలోని బయ్యవరం గ్రామ పంచాయతీ పరిధిలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరిగింది. రూ.కోటికి పైగా వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. సచివాలయంతో పాటు ప్రధానంగా సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించారు. ఇంటింటి కుళాయి కనెక్షన్లు తుదిదశకు చేరుకున్నాయి. దీంతో గత ప్రభుత్వాలేవీ తమను పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వంలో తమ గ్రామ రూపురేఖలు మారిపోయాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మారిన గ్రామ స్వరూపం

బయ్యవరంలో సుమారు 3,500 మంది జనాభా ఉన్నారు. కశింకోట మండలంలోని పెద్ద గ్రామాల్లో ఇదొకటి. సచివాలయ వ్యవస్థ ఏర్పడ్డాక గ్రామ స్వరూపమే మారిపోయింది. కొత్తగా సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో మొదటిసారిగా సచివాలయాన్ని ప్రారంభించింది కూడా ఇక్కడే. సచివాలయం కోసం పంచాయతీ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న స్థలంలో రూ.25 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించారు. సుమారు రూ.30 లక్షలతో పలుచోట్ల సిమెంట్ రోడ్లు వేశారు.

- గతంలో హైస్కూల్ పక్క రోడ్డు చాలా అధ్వానంగా ఉండేది. దాన్ని సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేశారు.
- ఎన్టీఆర్ కాలనీ, పంచాయతీ కార్యాలయం వద్ద సిమెంట్ రోడ్లు వేశారు.

జరిగిన అభివృద్ధిలో కొన్ని..

- బయ్యవరంలో నిర్మించిన సచివాలయ భవనం ఖర్చు రూ.25 లక్షలు
- సిమెంట్ రోడ్ల నిర్మాణానికి వెచ్చించిన మొత్తం రూ.30 లక్షలు
- జల్ జీవన్ మిషన్‌లో 560 ఇంటింటి కుళాయిలకైన వ్యయం రూ.28 లక్షలు
- మురుగు కాలువల నిర్మాణానికి వెచ్చించిన మొత్తం రూ.5 లక్షలు
- శ్మశానం అభివృద్ధి వ్యయం రూ.5 లక్షలు
- పేదలకు నిర్మిస్తున్న ఇళ్లు : 80


బయ్యవరంలో నిర్మాణం పూర్తయిన సచివాలయ భవనం

- ఎస్సీ కాలనీలో రోడ్డును వెడల్పు చేసి, సిమెంట్ రోడ్డు వేశారు. రూ.5 లక్షలతో సీసీ డ్రైనేజీలను నిర్మించారు.
- తాగునీటి సమస్య నివారణకు జల్ జీవన్ మిషన్ కింద రూ.28 లక్షలతో ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. 560 ఇళ్లకు త్వరలోనే కనెక్షన్లు ఇవ్వనున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజల తాగునీటి ఇక్కట్లు శాశ్వతంగా తీరనున్నాయి.
- పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా రెండు చోట్ల వైఎస్సార్, జగనన్న లేఅవుట్లు వేశారు. వీటిలో 80 మందికి ఇళ్లు ఇచ్చారు. దాదాపు సగం మేర ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.
- రూ.5 లక్షలతో శ్మశానానికి సిమెంట్ రోడ్డు నిర్మించి, అభివృద్ధి చేశారు.

మా బతుకులు మారాయి



గత ప్రభుత్వం వరకు మా ఊరిలో జరిగిన మార్పులు చెప్పాలంటే మాటలు వెతుక్కోవాలి. జగనన్న హయాంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మా బతుకుల్లో, ఊరిలో చాలా మార్పులొచ్చాయి. నాకు ఇద్దరు కూతుళ్లు. ఇంటర్ చదువుతున్న చిన్న కూతురుకు అమ్మఒడి వస్తోంది. అర్హతలున్న ప్రతి సంక్షేమ పథకాన్నీ మాకు అందించారు. ఊరును బాగు చేశారు. అంతకు మించిన ఆనందం ఏముంటుంది.

– ఒమ్మి ఈశ్వరరావు, కూలీ

కళ్ల ముందే అభివృద్ధి, సంక్షేమం



మా ఊరిలో సిమెంట్ రోడ్లు వేసి గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి చేశారు. హైస్కూలు పక్కనున్న రోడ్డు చాలా దారుణంగా ఉండేది. ఇప్పుడు సిమెంట్ రోడ్డు వేయడంతో విద్యార్థులు, ప్రజలు సౌకర్యవంతంగా రాకపోకలు సాగిస్తున్నారు. మా నాన్న రామారావుకు వృద్ధాప్య పింఛన్ ప్రతి నెలా రూ.3 వేలు వస్తోంది. నాకు రైతు భరోసా వస్తోంది. పంటల సాగుకు, మా కుటుంబం బతికేందుకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

– బరుకు బాలకృష్ణ, రైతు

అవగాహనతోనే క్షయ నియంత్రణ

అనకాపల్లి: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారులు నీరజ, అయ్యప్పరెడ్డిలు అన్నారు. క్షయవ్యాధి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఏఎంసీ కాలనీ అయుష్మాన్ ఆరోగ్య మందిరం ఆధ్వర్యంలో గురువారం వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1882 మార్చి 24న ఈ వ్యాధికి కారణమయ్యే బ్యాక్టీరియాను రాబర్ట్‌కోచ్ బయటపెట్టారన్నారు. ఈ నెల 24న ఏటా క్షయ నిర్మూలన దినంగా జరుపుతున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి టీబీని ఓడిద్దాం.. దేశాన్ని గెలిపిద్దాం అంటూ సిబ్బంది నినాదాలు చేశారు. ర్యాలీలో సిబ్బంది యల్లాజీ, పెంటయ్య, ఎస్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ట్రాఫిక్ సమస్య తొలగించాలని వినతి

అనకాపల్లి: పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరచి ప్రజలకు భద్రత, రక్షణ కల్పించాలని డీఎస్పీ ఎస్.అప్పలరాజుకు సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు గురువారం కోరారు. ఈ మేరకు డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయనకు మర్యాదపూర్వకంగా శాలువా కప్పి, వినతిపత్రం అందించారు. నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత ప్రమాదాలతోపాటు ట్రాఫిక్ సమస్య పెరిగిందన్నారు. అంతకుముందు మెయిన్‌రోడ్డు సీతారామాలయంలో సీతారాములను దర్శించుకుని, ప్రజలకు ప్రమాదాలు జరుగకుండా కాపాడాలంటూ ప్రార్థించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం, కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

ఘనంగా ముత్యాలమ్మ ఉత్సవం

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం శివారు పాత కన్నూరుపాలెంలో గురువారం ముత్యాలమ్మ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించి, పూజలు చేశారు. రవికెలు, చీరలు, అరటి గెలలు తదితర రూపాల్లో మొక్కులు తీర్చుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ ఎస్.శివ, ఉత్సవ కమిటీ నిర్వాహకులు కన్నూరు అప్పలనాయుడు, కె.అప్పారావు పాల్గొన్నారు.


పాత కన్నూరుపాలెంలో ముత్యాలమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు

పోషకాహారంతో ఆరోగ్య సంరక్షణ

కశింకోట: స్థానికంగా లభ్యమయ్యే ఆకు కూరలు, కూరగాయలు, పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తినడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.సుచరిత సూచించారు. మండలంలోని తాళ్లపాలెం-3 అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా పోషణపై బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు, తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలమృతంతో లడ్డూలు తయారు చేసి పిల్లలకు తినిపించాలన్నారు. లడ్డూ తయారీతోపాటు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల తయారీ గురించి డెమో చూపారు. ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ మునగాకు, చింత చిగురు, ఉసిరి, జామ పండ్లు ఆహారంలో భాగంగా చేసుకో వాలన్నారు. అంగన్‌వాడీలు, ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్

యూటీఎఫ్ నేత ఏవీఎస్‌కు ఘన నివాళి

తుమ్మపాల: ఉపాధ్యాయుడిగా 14 ఏళ్ల సర్వీస్‌ను వదిలి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు అప్పారి వెంకటస్వామి(ఏవీఎస్) అని సంఘ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి కొనియాడారు. ఏవీఎస్ 23వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఏపీ యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయనకు ఉపాధ్యాయ సమాజం రుణపడి ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి రాజేష్, కార్యదర్శులు జీఎస్ ప్రకాష్, దేముడునాయుడు, కామరాజు, ఉపాధ్యాయులు రమేష్‌రావు, శేషుకుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

అనకాపల్లి: విశాఖ కేజీహెచ్‌లో చింతకాయల లక్ష్మి(63) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు. స్థానిక లక్ష్మీదేవిపేటకు చెందిన లక్ష్మి ఈ నెల 16న తన ఇంటి బాత్‌రూమ్‌లో కాలుజారి పడటంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతురాలి కుమార్తె భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పాఠశాలకు ఫ్యాన్ వితరణ


ఫ్యాన్‌ను అందిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాలకు సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి శివబాపునాయుడులు టవర్ ఫ్యాన్‌ను వితరణ చేశారు. సర్పంచ్ మనవడు జన్మదిన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. శేఖర్, మారిశెట్టి వెంకట అప్పారావు, అరుణ, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన


రైతులకు సేంద్రియ వ్యవసాయ సాగుపై అవగాహనలో విద్యార్థులు

కశింకోట: మండలంలోని తేగాడలో రాష్ట్ర జీవ వైవిధ్య మండలి, శారదా వ్యాలీ డెవలప్‌మెంటు సమితిల ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంఏఎల్ కళాశాలలో అగ్రికల్చరల్ బీఎస్సీ చదువుతున్న విద్యార్థులు సేంద్రియ వ్యవసాయ సాగు మెలకువలను వివరించారు. సమితి కోఆర్డినేటర్ కోన అప్పారావు, ఐసీఆర్‌పీలు సీహెచ్ నాగరాజు, కన్నయ్యమ్మ, పి.అప్పారావు, ఎల్.లోవరాజు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

23న మునగపాకలో ఉచిత మెగా వైద్య శిబిరం

మునగపాక : మండల కేంద్రంలో ఈ నెల 23న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంఎస్ఆర్ ఐటీఐ కరెస్పాండెంట్ మళ్ల జోగారావు ఒక ప్రకటనలో తెలిపారు. మునగపాకకు చెందిన డాక్టర్ మళ్ల మురళీకృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. పలు విభాగాలకు సంబంధించి నిష్ణాతులైన వైద్యులు వైద్య సేవలందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జోగారావు కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

ఇంటింటా ప్రచారంలో పార్టీ నాయకులు


ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ భార్య నివేదిత


కోట్నివీధిలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మిరియాలకాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

అనకాపల్లి: స్థానిక జీవీఎంసీ 84వ వార్డు కోట్నివీధిలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌కు మద్దతుగా పార్టీ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు అందిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చిన సీఎం జగన్‌కు అండగా నిలవాలని అభ్యర్థించారు. అనకాపల్లి అభివృద్ధి కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భరత్‌కుమార్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అప్పికొండ రవిశంకర్, కోరుకొండ రమేష్, కేతిరెడ్డి ప్రసాద్, సేనాపతి సాయి, కొసిరెడ్డి నాగేషు, కె.నాగరాజు, ఐ.వీ.కృష్ణారావు, బలిరెడ్డి హరినాథ్ పాల్గొన్నారు.

- స్థానిక మిరియాలకాలనీలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌కు మద్దతుగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గురువారం ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపిస్తే అనకాపల్లిలో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ గెలిస్తే ప్రజలు మరిన్ని సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక పూసర్ల వీధిలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత గురువారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తన భర్త పేరిట ముద్రించిన కర పత్రాలను పంపిణీ చేసి, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా తన భర్తను గెలిపించాల్సిందిగా ప్రజలను అభ్యర్థించారు. ఆమె వెంట సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరం గ్రామానికి చెందిన రజకుల సంఘం సభ్యులు గురువారం తమ అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. అమీన్‌సాహెబ్‌పేటలోని తన నివాసంలో రజకుల సంఘ సభ్యులు రాము, శివ, శ్రీనులకు కండువాలు కప్పి వారిని భరత్‌కుమార్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.


భరత్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరిన పల్లపు సోమవరం రజకుల సంఘం సభ్యులు

హైవే డివైడర్‌పై గ్రిల్స్ పెట్టరూ..

అనకాపల్లి: జీవీఎంసీ విలీనగ్రామం కేఎన్ఆర్ పేట జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు డివైడర్ మధ్యలో గ్రిల్స్‌ను ఏర్పాటు చేయాలని గ్రామ పెద్ద వి.ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. అనకాపల్లి నుంచి విశాఖకు కేఎన్ఆర్ పేట మీదుగా నిత్యం వేలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, రోడ్డు దాటే సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. జాతీయ రహదారుల సంస్థ అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు మధ్యలో గ్రిల్స్‌ను ఏర్పాటు చేసి, ప్రమాదాలను అరికట్టాలని కోరారు.


కేఎన్ఆర్ పేట హైవే డివైడర్ మధ్యలో గ్రిల్స్ లేని దృశ్యం

ముత్యాలమ్మతల్లి పండగకు భారీ ఏర్పాట్లు

సబ్బవరం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి అంతకాపల్లి శ్రీముత్యాలమ్మ అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు పనులను గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి గురువారం పరిశీలించారు. జాతర ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలో భాగంగా గురువారం ఉదయం అమ్మవారికి దూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి జాతరను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, గొంప ముత్యాలనాయుడు, గొంప శేఖర్, గండి మాలినాయుడు, అడిగర్ల రాజు, సబ్బవరపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి

ఈ రోడ్డు.. నో స్మోకింగ్ జోన్!



రోజూ తాము స్కూల్‌కు రాకపోకలు సాగించే సమయంలో ముక్కుపుటాలను అదరగొట్టే సిగరెట్ పొగలకు ఊపిరాడని పరిస్థితి. తాము పడుతున్న ఇబ్బందులు గమనిస్తున్నా.. పొగరాయుళ్లలో మార్పురాని పరిస్థితి. టీచర్లతో చెప్పించినా నో.. యూజ్! దీంతో ఆ విద్యార్థులకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. పొగ తాగేవారి కంటే దాన్ని పీల్చేవారు పడుతున్న ఇబ్బందులు వారికి తెలియజెప్పడమెలా? అన్న ఆలోచనతో వారి మెదళ్లకు పనిచెప్పారు. చివరికి వైట్ పెయింట్ తీసుకొచ్చి ఇలా తమ స్కూల్ సమీపంలోని రోడ్డును 'నో స్మోకింగ్ జోన్' అంటూ పెద్ద పెద్ద అక్షరాలతో నింపేశారు. 9వ తరగతి విద్యార్థులు ప్రణీత, సునీత, లక్ష్మిల చొరవకు స్కూల్ సిబ్బంది, సహ విద్యార్థులతోపాటు, గ్రామస్తులూ మెచ్చుకుంటున్నారు. ఇకనైనా పొగరాయుళ్లు పిల్లల ఆరోగ్యాలకు సహకరించాలని కోరుతున్నారు.

– అనకాపల్లి